# స్వాగతోపన్యాసం

మానవ వికాస వేదిక, తెలంగాణ రాష్ట్రశాఖ జరుపుకుంటున్న 2వ రాష్ట్ర మహాసభలకు హాజరయిన కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు, వక్తలకు, ప్రతి ఒక్కరికీ మహాసభల ఆహ్వాన సంఘం తరపున స్వాగతం, సుస్వాగతం. ఈ మహాసభలను కోదాడ పట్టణంలో, ఘనత వహించిన యం.యస్. కళాశాల ప్రాంగణంలో జరపటం పట్ల మా ఆహ్వాన సంఘం ఎంతో సంతోషిస్తున్నది.

తెలంగాణలో మానవవాదాన్ని ప్రచారం చేస్తున్న సంస్థ మానవ వికాస వేదిక. మానవవాదం ఈనాడు ప్రపంచ మంతటా వేగంగా విస్తరిస్తున్న ఒక ప్రత్యామ్నాయ జీవనవిధానం. ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, శాస్త్రీయ స్పృహ, మానవ హక్కులు వంటి ఆధునిక భావనలు మానవవాదానికి అంతరంగాలు. అవన్నీ మత భావజాలానికి వ్యతిరేకంగా, మానవ జీవితాన్ని ప్రయోజనకరంగా తీర్చిదిద్దటానికి పుట్టుకొచ్చినవే. ప్రస్తుత సమాజానికి అవే దిక్సూచికలు. మానవవాదం వాటన్నిటితో కూడినదై ఆధునిక జీవనాన్ని సుసంపన్నం చేయటానికి విస్తరిస్తోంది.

భారతీయ సమాజంలో వేల సంవత్సరాలనుండీ 'ధర్మం' పేరుతో మతతత్వం జనంలో వ్యాపించివుంది. విదేశాలనుంచి వచ్చిన ఇతర మతాలు సైతం హైందవధర్మ ప్రచారానికి లోనై మార్పులు పొందాయి. దేశప్రజల్లో సంస్కృతీ- మతమూ మధ్య వుండాల్సిన తేడా తొలగిపోయి, మతమే సంస్కృతిగా చలామణి అవుతూ వుంది. ప్రతి మతమూ కులవాసనలు నింపుకొని అసమానతలకు ఆలవాలమయింది. అసమానతలనేవి 'భగవంతుని సృష్టి' అని ప్రచారం చేసి, జనంనోళ్ళు మూయించటానికి మతగ్రంథాలు తీవ్రంగా ప్రయత్నించాయి. కులాల ద్వారా మనుషులను విభజించటమే కాకుండా, స్త్రీ పురుషుల మధ్యకూడా హక్కుల అసమానతలను ఏర్పర్చి, వివక్షతను చట్టబద్ధం గావించారు. ఈ వివక్షత ఆర్థికరంగాన్ని కూడా ప్రభావితం చేసి, అసమానతల ఆర్థిక వ్యవస్థను ఏర్పర్చి, కర్మ సిద్ధాంతంతో యధేచ్ఛగా దోపిడీ కొనసాగించటానికి మార్గమేర్పర్చింది. ప్రాచీన రాజరికాన్ని సమర్థిస్తూ ఏర్పడిన మతశాసనాలు, సూత్రాలే నేటికీ జనంలో తిష్టవేసి వుండటం వల్ల రాజకీయరంగంలో కూడా ప్రజాస్వామ్యానికి బదులు, రాజరిక విధానాలే కొనసాగుతున్నాయి. ప్రజాస్వామిక రాజ్యాంగ సాక్షిగా, రాచరిక రాజకీయాలు నడుస్తున్న విచిత్రమైన స్థితిలో మన సమాజం వుండటానికి ఇక్కడి మత భావజాలమే ముఖ్యకారణం. కనుక, భారతీయ సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలన్నీ ఇప్పటికీ మతతత్వ పూరితమై ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని, మానవహక్కుల్ని, శాస్త్రీయదృక్పథాన్ని ప్రజలకు చేరువకానివ్వకుండా అడ్డుపడుతున్నాయి. ఆ రంగాలన్నింటినుంచి మతాన్ని దూరం చేసి, లౌకికతత్వాన్ని పాదుకొల్పాలంటే మానవవాదం వ్యాపించవలసి వుంది.

గత కొంతకాలంగా, దేశమంతటా అసహనపూరిత వాతావరణం ఏర్పడి వుండటం మనకు తెలుసు. భిన్న అభిప్రాయాలను, విభిన్న ఆలోచనారీతుల్ని సహించలేక, పలువురు ప్రజాస్వామిక, హేతువాద నేతలను హతమార్చటం కూడా మనం ఎరుగుదుము. పౌరసమాజంలోనే కాదు, విశ్వవిద్యాలయాల్లో కూడా ఈ అసహనత కారణంగా ఎందరో విద్యార్థులు కూడా బలయ్యారు. ఈ పరిస్థితుల్ని నిరాకరిస్తూ అనేకమంది మేధావులు, రచయితలు, కళాకారులు, శాస్త్రవేత్తలు కూడా తమ తమ పదవుల్ని, బిరుదుల్ని పరిత్యజించారు. అలాంటివారిలో ప్రముఖునిగా వున్న డాక్టర్ పి.యం. భార్గవ పేరుతో మనమీ సభాప్రాంగణాన్ని పిల్చుకుంటున్నాం. ఇటీవలే వారు మరణించినప్పటికీ, శాస్త్రీయ స్పృహకోసం జీవితాంతం పోరాడిన ఆ మహామహుని స్మరించుకోవటానికి, స్ఫూర్తిని నింపుకోవటానికి, వారిపట్ల మన గౌరవాన్ని చాటుకోవటానికి, మానవ వికాస వేదిక ప్రయత్నించటం అభినందనీయం. అసహనం అనేది మతంలో అంతర్గతంగా, అత్యంత సహజంగా వుండే ఒక దుర్లక్షణం. దానివల్లనే మనుషుల్లో మృగత్వం తలెత్తుతూ మారణకాండకు దారితీస్తుంది. శిశుదశ నుండి మతమూఢత్వం మెదళ్ళలో కూర్చబడి ఉండటం వల్ల, పశుత్వం ద్వారా కూడా దేవుని ప్రసన్నతను పొందవచ్చునన్న మూర్ఖత్వం మనిషిని పశువుగా మారుస్తున్నది. కనుక మనిషి మనిషిగా ఎదగాలంటే మతతత్వం, మూఢనమ్మకాలు అంతరించాలి.

తెలంగాణలో మూఢనమ్మకాలు బలంగా వున్నాయి. మంత్రాల భయం, బాణామతి, గుప్తనిధులకోసం నరబలియివ్వడం, పూజలతో ధనాన్ని రెట్టింపు చేయడం, జాతకాల జోస్యాలపిచ్చి, వాస్తుభ్రమలు లాంటి గుడ్డినమ్మకాలు పామరుల్లోనే కాదు, చదువరుల్లోనూ, పాలకుల్లోనూ బలంగా పాతుకుని వున్నాయి. అవన్నీ వాస్తవాలు కావని ఆధునిక విజ్ఞానం చెపుతున్నా, దానిని పెడచెవిన పెట్టే మొండివైఖరి దండిగానే వుంది. ఇలాంటి మూఢనమ్మకాల కారణంగా తెలంగాణా నలుమూలలా అనేక నేరాలు, ఘోరాలు జరుగుతూ ఆర్థికంగానే గాక, అనేక విధాలుగా జనం కష్టాల పాలవటం మనం గమనిస్తున్నాం. విచిత్ర మేమిటంటే, కొన్ని ప్రసార, ప్రచారసాధనాలు సైతం తమ వ్యాపార ప్రయోజనాలకోసం మూఢత్వాన్ని ప్రోత్సహించటం. ప్రజల్ని వైజ్ఞానికంగా చైతన్యపర్చటానికి విస్తృత అవకాశాలున్న మీడియా, తన బాధ్యతలను విస్మరించటం విచారకరం. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో, ప్రజల్లో హేతువాదదృష్టిని పెంచటానికి సైన్సువాద, హేతువాద, మానవవాద సంఘాలు, వ్యక్తులు చేస్తున్న కృషి సాహసోపేతం, ప్రశంసనీయం, వారందరికీ మనం జేజేలు పలకాలి.

మానవ వికాస వేదిక కూడా అటువంటి కృషిలో మమేకమై పనిచేస్తున్నది. భారత రాజ్యాంగంలో 51a (h) లో పేర్కొన్న శాస్త్రీయ స్పృహ, మానవ వాదం, పరిశీలనా సంస్కరణతత్వాల పెంపుదలను బాధ్యతగా తలకెత్తుకొని పోరాడుతున్నది. 'స్వేచ్ఛాలోచన' మాసపత్రికను ఆ లక్ష్యసిద్ధికే అంకితం చేసింది. ఈ సంస్థ స్థాపించబడి 13 ఏళ్లు గడిచాయి. ఈ మధ్యకాలంలో అనేక జనహిత ప్రచార కార్యక్రమాల్ని నిర్వహించింది. మూఢత్వంపై మీడియాలోనూ, విరుచుకు పడింది. నిబద్ధతగల కార్యకర్తలు, చక్కని ఆశయ ప్రణాళికలతో మానవ వికాస వేదిక, పిట్ట కొంచెమైనా కూత ఘనమని చాటి చెపుతోంది.

ఉమ్మడి రాష్ట్రంగా వున్నపుడు నాలుగు రాష్ట్ర మహాసభలు జరుపుకొని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రెండో మహాసభను ఇపుడు కోదాడలో జరుపుకొంటున్న మానవ వికాస వేదిక మహాసభలకు ఘనంగా స్వాగతం పలుకుతున్నాం. తెలంగాణా అభివృద్ధికి మానవవాదం ఎలా తోడ్పడగలదో, అందుకు ఎలాంటి కార్యాచరణ అవసరమో ఈ రెండు రోజుల్లో చర్చకు వస్తాయని ఆశిస్తున్నాం. తెలంగాణ అంతటా గాఢంగా వ్యాపించి వున్న మూఢనమ్మకాల, మూఢాచారాల కలుషిత వాతావరణాన్ని తొలగించి, స్వచ్ఛమైన వైజ్ఞానిక మలయమారుతాల్ని వ్యాపింప చేయటానికి ఈ మానవ వికాస వేదిక రాష్ట్ర మహాసభలు దోహదపడాలని ఆశిస్తున్నాం. అందుకు, మా పూర్తి సహాయ సహకారాలు, ఈ సంస్థకు ఎల్లవేళలా వుంటాయని హామీ యిస్తున్నాం. ఈ రెండు రోజుల మహాసభలు ఆశించిన ఫలితాలనందుకుని జయప్రదం కావాలని ఆకాంక్షిస్తున్నాం.

ధన్యవాదాలు

తేదీ: 09-9-2017

**– మహాసభల ఆహ్వాన సంఘం, కోదాడ**